# ఖైదీ



ఎ.వి.రెడ్డి శాస్త్రి

సంప్రదాయ వర్మ అను రాజు తన రాజ్యంలో తిరుగుతున్న గమ్మత్తయిన మనుషుల గురించి విన్నాడు. విని బాగా చికాకుపడ్డాడు. బోలెడు కోపం కూడా తెచ్చుకున్నాడు. తదుపరి ఏకాంతమందిరంలో ఒక్కడే కూర్చొని "ఏమిటి వీళ్లంతా యిలా ప్రవర్తిస్తున్నారు? నలుగుర్లాగా మసులుకోవాలని, నలుగురు నడిచే తోవలోనే నడవాలనీ వుండదా ఈ మూర్ఖులకి? రాజుని నన్ను చూసేనా నడవడికను అలవాటు చేస్కోవద్దా?

నేను ఏనాడేనా మా పూర్వులు నడిచిన పద్ధతిని కాదని, వీసమెత్తేనా కొత్తమార్గంలోకి వెళ్లేనా? అయితే, నేనూ నా పూర్వీకుల మాదిరే ఎవరికీ నా వునికి తెలియకుండానే ఎలావచ్చానో అలాగే గుట్టుచప్పుడు కాకుండా యీ లోకంలోంచి నిష్క్రమిస్తానని యీ అభాజనులంతా వాగుతున్నట్టు తెలిసింది. చూస్తాను, చూస్తాను. అసలు యీ అభాజనులందర్నీ ఓ పట్టుపడితేనేగాని, యీ రాజ్యం ప్రశాంతంగా వుండేటట్టులేదు." అని పళ్లు పటపట కొరుకుతూ ఆలోచనలో పడిపోయేడు రాజు.

చివరికో నిశ్చయానికొచ్చాడు. "ఈ గుంపంతట్నీ కొట్లో పడేస్తేగాని దేశానికి ముక్తుండదు. వీళ్ల ప్రలాపాలు విని చెడిపోతున్న వాళ్లసంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది" అని తక్షణం భటుల్ని పిలిపించి దేశంలో గమ్మత్తు గమ్మత్తుగా మాట్లాడ్డం అందర్లాగా కాకుండా తమకి నచ్చిన విధంగా ప్రవర్తించడం చేస్తున్న వాళ్లందర్నీ బంధించి తీసుకురమ్మన్నాడు.

అలాటి వాళ్లందర్నీ పట్టితెచ్చారు భటులు. వారి మీద అభియోగం చెయ్యడానికి ముందు వాళ్లపేర్లు చదివేడు మంత్రి- సోరెన్ కిర్క్‌గార్డ్, మార్టిన్ హైడెగ్గర్, ఫ్రెడరిక్‌నీచా, ఫ్రాంజ్‌కాఫ్కా, ఫయోడర్ దాస్టొవస్కీ, జాఁపాల్ సార్త్ర్, ఆల్బర్ట్ కమూ, సేమ్యుయేల్ బెకెట్, యూజిన్ అయొనొస్కో యిత్యాదులు. వీళ్లంతా సంప్రదాయ వ్యతిరేకులనీ, ఆత్మాశ్రయవాదులనీ, తమ భావజాలంతోనీ, రాతలతోనీ సమాజంలో తీవ్రమయిన అసంతృప్తినీ, ఆందోళననీ సృష్టిస్తున్నారనీ అభియోగం. పైగా వీళ్లంతా మేధావులు కనక - సమాజం వీళ్ల విషయంలో జాగ్రత్తగా వుండవలసిన అవసరం ఎంతైనా వుందని మంత్రిగారు వివరించేరు.

అయితే మేధావులంటే ఏమిటో బోధపడ్లేదు రాజుగారికి. అర్థం అడిగి తెలుసుకోవాలంటే హోదా అడ్డొచ్చింది. మేధావులంటే ఒకరకమైన ప్రమాదకరమయిన వ్యక్తులైవుంటారనే నిశ్చయానికొచ్చి వాళ్లందర్నీ బందిఖానా లో వేయించమన్నాడు.

మర్నాడే ఓ కొత్త సమస్య వచ్చిపడింది. "స్థూలంగా మా ఆలోచనా విధానం ఒకటే అయినా, ఆచరణలో మాలో మాకు బోలెడుతేడాలున్నాయి. అంచేత మేమంతా కలిసి ఒకదగ్గర వుండడం కుదరదు. వేరు వేరుగా మమ్మల్ని వుంచడానికి ఏర్పాట్లు చేయించండి" అని బందీలంతా ఆందోళన లేవదీశారు.

అదీ మంచిదేనని పించింది రాజుకి. ఈ గుంపంతా ఒక్కదగ్గరే వుంటే ప్రపంచానికి చిచ్చుపెట్టడానికి కావలసినన్ని వెర్రిమొర్రి రాతలురాసి తిక్కతిక్క నినాదాలు చేసి గొర్రెల్లాంటి మామూలు జనానికి కూడా యిక్కడేదో అఘాయిత్యం జరిగిపోతోందనే అనుమానం కలిగించవచ్చు. అంచేత వీళ్లని వేరువేరు గదుల్లో బంధించి వుంచడమే శ్రేయస్కరం అనుకున్నారు రాజుగారు. అయితే మంత్రిగారో చిన్న సవరణ ప్రతిపాదించేరు. "వీళ్లంతా సాదాసీదా రకం మనుషులు కారని ముందే మనవి చేశాను కదా! వీళ్లని మనం బందీలుగా వుంచేం అనే భావం వాళ్లకి స్ఫురించకుండా చూస్కోవడం చాలా ముఖ్యం. అలాంటి అభిప్రాయం వాళ్లకి కలిగిన్నాడు మనకి చాలా చిక్కులు ఎదురవుతాయి. వ్యక్తి స్వేచ్ఛగా జీవించాలనేది కదా వాళ్లందరి ధ్యేయం. మరలాంటప్పుడు వాళ్ల స్వేచ్ఛకే ముప్పుఏర్పడిందనే భావం వాళ్లకి కలిగిందా అది మనకి ప్రమాదం తెచ్చిపెట్టే పరిస్థితి కావచ్చును. ఆ స్థితి రాకుండా మనం చూస్కోవాలి."

రాజుగారికి అర్థమయింది. "ఒక్కొక్క మేధావిగాడికీ ఒక్కొక్క భవంతి కట్టించేసి అందులో స్వేచ్ఛగా నువ్వేం చేస్కోవాలంటే అది చేస్కో" అనేస్తే సరిపోతుందని నిశ్చయించి, భవంతుల నిర్మాణానికి శిల్పుల్ని రప్పించేడు.

భవనాల నమూనాలు రూపకల్పన చెయ్యడంలో పాబ్లో పికాసో, సాల్వడార్ డాలీలు సాయపడ్డారు. వారి నమూనాలలో తయారయిన భవనాలు ఎవరికీ అర్థం కాని అనూహ్య సౌందర్య సంభ్రమాలకి ప్రతీకల్లాగా తయారయ్యాయి. ఏ తిక్క మనిషికి కేటాయించబడిన భవనం చూసినా దాని ప్రత్యేకత దానిదే. దానికీ మరో భవంతికీ పోలికే లేదు. భవంతుల్లో అన్నిరకాల సదుపాయాలున్నాయి. ముఖ్యంగా రాసుకోవడానికి కావల్సిన కాయితం వగైరా సరంజామా, చదువు కోవడానికి ఎవరి అభిరుచికి సరిపోయే పుస్తకాలు వారి వారి భవంతుల్లో అమర్చబడ్డాయి. ఆలోచిస్తూ పచార్లు చేస్కోడానికి విశాలమైన కారిడార్లు, వుద్యానవనాలున్నూ మొత్తం మీద భవనాల్లో ఏర్పాట్లు దివ్యంగా అమిరేయి.

అంతా బాగా సాగిపోతోంది అనుకునే సరికి రాజుగారికి మళ్లీ మరో అనుమానం వచ్చిపడింది. "వేరువేరుగా వుండాలని వీళ్లంతా కోరుకున్నారు కదా- కొంపతీసి ఎవడి మట్టుకువాడు చడీచప్పుడు కాకుండా తప్పించుకుపారిపోడానికి వేసిన పథకం కాదు కద యిది?" అని. దాంతో ఆయనకి ఎక్కడ లేని ఆందోళనా పట్టుకుంది. భటుల్ని కూడా ఎవడ్నీ నమ్మడం మానేసి స్వయంగా తానే ఖైదీలని వాళ్ల చర్యల్ని గమనించాలని సంకల్పించేడు. ఖైదీలు తప్పించుకుపోతారేమోననే భ్రమ అతన్ని ఎంతలా ఆవహించిందంటే రాత్రి పగలు వాళ్లని గురించే ఆలోచిస్తూ కూర్చోడమే అతని నిత్యకృత్యమై కూర్చుంది. దాంతో రాచకార్యాలు వెనక పడ్డాయి. సామంతుల్ని, మంత్రుల్ని పిలిచి పరిపాలన వ్యవహారాలు చూస్కోమన్నాడు. తన కాలాన్ని పూర్తిగా ఖైదీలను గమనించే పనికే వినియోగిస్తున్నాడు. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా యింకా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా లేవేమోనన్న భయం రాజుని పీడిస్తోంది.

అతనికో వుపాయం తట్టింది. తనకి మిక్కిలి నమ్మకస్తుడైన కోలిన్‌విల్సన్ అనే గూఢచారిని పిలిచి అతనికీ పని అప్పగించేడు. విల్సన్ ఖైదీల భవంతులలోకి వెళ్లి వాళ్ల బాగోగులు, మంచిచెడ్డలు కనుక్కుంటున్న వాడిలా ప్రవర్తించి మాటల మధ్యన యధాలాపంగా "మీరు ఎందుకు ఈ బందిఖానాలో వుండాలి? ఇక్కడ్నుండి ఎందుకు తప్పించుకుపోడానికి ప్రయత్నించకూడదు?" అని సూచించి ఆ సూచనకి వాళ్ల నుండి వచ్చే స్పందనని రాజుగారికి తెలియపర్చాలి.

తనకప్పచెప్పబడిన పని పూర్తి చేసుకు వచ్చాడు కోలిన్ విల్సన్.

"ప్రభూ, వారందర్నీ అడిగిచూసేను. అందరూ యించుమించూ ఒకేరకంగా సమాధానాలు యిచ్చేరు. మీరు బందిఖానాలో వున్నారు అన్న మాట ఎత్తగానే అంతరూ ఆశ్చర్యం ప్రకటిస్తూ "బందిఖానానా? మాకా? లేదే - యిప్పుడే మేం పూర్తి స్వేచ్ఛని అనుభవిస్తున్నాం. గుంపుల మధ్యన వున్నప్పుడు ఆ జనంలాగే అందరూ నడిచిన తోవని నడవలేక వారి మార్పులేని సంప్రదాయ భావాలతో ఏకీభవించలేక మా అభిప్రాయాలకనుగుణంగా వారిని తిప్పుకోలేక నానా ఇబ్బందిగా వుండేది.

జనం మధ్యన వున్న రోజుల్లో అయ్యో వీళ్లంతా సంప్రదాయాలనే గోడల మధ్యన చిక్కుకు పోయిన బందీలే వీళ్ల మధ్యన చిక్కుపడిపోయి మనం కూడా ఓ రకంగా బందీలమాదిరి వుంటున్నామే అనిపించేది. ఇక్కడికొచ్చిన తర్వాత జనాల్ని చూసి అయ్యోపాపం అని రోజూ విచారించే బాధ తప్పింది. ఇప్పుడు మేం పూర్తి స్వేచ్ఛననుభవిస్తున్నాం. మనస్సుకి హాయిగా వుంది. పాపం ఆ రాజుని చూస్తేనే జాలివేస్తోంది అన్నారు ప్రభూ" అని ఆగేడు విల్సన్.

ఏదో చెప్పడానికి వెనకాడుతున్నట్టనిపించి రాజుగారు అడగనే అడిగేశారు "నన్ను చూస్తే జాలా? ఎందుకు?

చెప్పడానికి విల్సన్ సంకోచిస్తుండడం చూసి, ఫర్వాలేదు చెప్పమని భరోసా యిచ్చేరు రాజుగారు. "మమ్మల్ని బందీల్ని చెయ్యబోయి తను బందీ అయిన వైనం గ్రహించినట్టులేదు యీ రాజు అన్నారు ప్రభూ వాళ్లంతా" అని చెప్పేడు విల్సన్.

భళ్లున నవ్వేడు రాజు. "నేను బందీనయ్యానా? ఏమి తిక్కవెధవ ఆలోచన వీళ్లది! మంచిపనే చేశానన్నమాట యిలాంటి తిక్కవెధవలందర్నీ బందిఖానాలోవేసి" అని స్వగతించుకుంటూ గర్వంగా మీసం తిప్పుకుంటూ దర్పంగా అంతఃపురంలోకి వెళ్లిపోయాడు రాజు.

వెళ్లిపోతున్న రాజుని "అమాయకప్పీనుగ" అన్నట్టు చూసేడు కోలిన్ విల్సన్. ●